సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 2 । జనవరి । 2024



కోమటిలంకలో కోడిపందేలు

కొల్లేరు నడిబొడ్డున ఉన్న ఏలూరు మండలం కోమటిలంకలో కోడిపందేలు, జూదం జోరుగా సాగుతున్నాయి.

8లో ▸



కల్వర్టును ఢీకొని..

నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొని బైక్‌పై ఇంటికి వెళుతున్న ఓ కూలీ కల్వర్టును ఢీకొని పంట బోదెలో పడి మృతి చెందాడు.

8లో ▸



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

8లో ▸

రూ. 3 వేలు.. ఆనంద పరవళ్లు

నవ్వులు కురిపించెన్

- పెన్షన్ పెంపుతో ఆనందోత్సాహాలు
- జిల్లాలో మొదలైన పంపిణీ
- 5 వరకు పెన్షన్ పెంపు వేడుకలు
- జిల్లాలో 2,36,928 మందికి లబ్ధి

సాక్షి, భీమవరం: ప్రభుత్వం సామాజిక పింఛన్ లబ్ధిదారులకు నూతన సంవత్సరం కానుక అందిస్తోంది. వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచగా పంపిణీ జిల్లాలో మొదలైంది. కాళ్ల మండలం పెదఅమిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 5వ తేదీ వరకూ పింఛన్ పెంపు వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచడంపై లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో ప్రహసనంలా సాగిన పింఛన్ల పంపిణీని సీఎం జగన్ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సరళతరం చేయడంతో పాటు ఒకటో తారీఖున వేకువజామునే ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ మొత్తం అందిస్తున్నారు. అలాగే పింఛన్ల సంఖ్యను కూడా గణనీయంగా పెంచారు. దీనిలో భాగంగా ఈనెల నుంచి జిల్లాలో 4,274 కొత్త పింఛన్లు మంజూరు కాగా మొత్తంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి తదితర పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య 2,36,928కు చేరింది. ప్రస్తుతం పెరిగిన పింఛన్ సొమ్ముతో లబ్ధిదారులకు నెలకు రూ.69.55 కోట్లు సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

పండగలా పంపిణీ : ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పెంచిన పెన్షన్ మొత్తాన్ని అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణ, మండలాల్లో మంగళవారం నుంచి 5వ తేదీ వరకూ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. ఆయా చోట్ల నిర్ణీత ప్రదేశాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందిస్తారు. వచ్చేనెల నుంచి యథావిధిగా 1వ తేదీన ఉదయమే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ములు అందజేస్తారు.

తొలిరోజు 13 మండలాల్లో..

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో పింఛనర్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటనలో తెలిపారు. సోమవారం తొలిరోజు జిల్లాలోని 13 మండలాల్లో 1,836 మంది లబ్ధిదారులకు రూ.54,50,000 నగదు అందజేశామని పేర్కొన్నారు.



కాళ్ల మండలం పెదఅమిరంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



పాలకొల్లులో దివ్యాంగుడు సత్యనారాయణకు పింఛన్ అందిస్తున్న దృశ్యం

అంతటా హర్షాతిరేకాలు

పాలకొల్లు అర్బన్: పెన్షన్ పెంపుతో లబ్ధిదారుల ఆనందం రెట్టింపయ్యింది. కొత్త ఏడాది తొలిరోజునే పెంచిన పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. పాలకొల్లులో సోమవారం వలంటీర్లు వైఎస్సార్ పెన్షన్ కానుకను పలువురికి అందజేశారు. 28వ వార్డులో ఎర్రా సత్యనారాయణ అనే దివ్యాంగుడికి వలంటీర్ కెల్లా లక్ష్మి సొమ్ములు అందజేశారు. వార్డు ఇన్‌చార్జ్ శీలం సూరిబాబు పాల్గొన్నారు.

వేడుకల షెడ్యూల్

- **2వ తేదీన..** ఆకివీడు అర్బన్, ఆకివీడు రూరల్, అత్తిలి, ఇరగవరం, నరసాపురం అర్బన్, పాలకొల్లు అర్బన్, తణుకు అర్బన్, రూరల్, కాళ్ల, ఉండి మండలాలు.
- **3వ తేదీన..** నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు మండలాలు.
- **4వ తేదీన..** పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, మొగల్తూరు, పాలకొల్లు, భీమవరం అర్బన్, తాడేపల్లిగూడెం అర్బన్, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు, పోడూరు మండలాలు.
- **5వ తేదీన..** వీరవాసరం, గణపవరం మండలాలు.

ఆర్థిక భరోసా కల్పించేలా..

కాళ్ల: సామాజిక భద్రత కింద అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.250కు పెంచి రూ.3 వేలు అందిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం మండలంలోని పెదఅమిరంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మరింత ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని పెంచిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక స్థితిగతులు మారుతున్నాయన్నారు. వృద్ధాప్య, చేనేత కార్మికులు, వితంతు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్ జెండర్లు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారుల పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం రూ.3 వేలకు పెంచిందన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, డీఆర్డీఏ పీడీ ఎస్‌వీఎస్ ప్రసాద్‌యాదవ్, తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎంఎస్ భాస్కరరావు, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తంచన్‌గా పింఛన్



గతంలో పింఛన్ సొమ్ముల కోసం పంచాయతీ వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. ఒక్కోసారి వారం పదిరోజుల వరకు ఇచ్చేవారు కాదు. జగన్ బాబు వచ్చాక ఒకటో తారీఖున తెల్లారకుండానే వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ సొమ్ములు చేతిలో పెడుతున్నారు.

– నాగిడి వెంకటేశ్వర్లు, దొంగపిండి, భీమవరం రూరల్

జగనన్న వచ్చాకే పెన్షన్



నేను దివ్యాంగురాలిని. టీడీపీ ప్రభుత్వంలో ఏవో కారణాలు చెప్పి అప్పటివరకు నాకు వస్తున్న దివ్యాంగ పెన్షన్ ఆపేశారు. జగనన్న వచ్చాక దరఖాస్తు చేసుకుంటే మరలా పింఛన్ మంజూరైంది. గతేడాది నా భర్త చనిపోగా ఇప్పుడు ఆ పింఛన్ సాయమే నాకు జీవనాధారమైంది.

– శీతాల వెంకటలక్ష్మి, దివ్యాంగురాలు, నరసాపురం

చాలా ఆనందం



నిరుపేద అయిన నాకు పింఛనే జీవనాధారం. దీంతోనే బతుకుతున్నా. గతంలో రెండు వేలు ఉన్న పింఛన్‌ను జగన్‌బాబు వచ్చాక పెంచుతూ వచ్చారు. ఇప్పుడు మూడు వేలు చేయడం చాలా ఆనందంగా ఉంది. పేదలకు ఎంతో మేలు చేస్తున్న జగన్ బాబుకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– చిన్ని సింహాచలం, 7వ వార్డు, తాడేపల్లిగూడెం

చెప్పినట్టుగానే రూ.3 వేలు



పింఛన్ సాయం రూ.3 వేలకు పెంచుతానని ఎన్నికలకు ముందు మాట ఇచ్చారు. చెప్పినట్టుగానే రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుకుంటూ వచ్చారు. ఈ పెంపు మాలాంటి పేదవర్గాల వారికి వరం. దీనివలన లబ్ధిదారులకు మరింత ఆర్థిక భరోసా కలుగుతుంది.

– కాటికా శాంతమ్మ, పెదఅమిరం, కాళ్ల మండలం

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి రవీంద్రబాబుకు శ్రీవారి జ్ఞాపిక అందిస్తున్న ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి న్యాయమూర్తి రవీంద్రబాబు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

ఐజీగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి లభించింది. సోమవారం ఏలూరులోని కార్యాలయంలో ఐజీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన నూతన సంవత్సర కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అశోక్‌కుమార్ 1996లో డీఎస్పీగా పోలీస్‌శాఖలో ప్రవేశించారు. 2004 వరకు డీఎస్పీగా, అదనపు ఎస్పీగా అనంతపురం, గుంటూరు జిల్లాల్లో పనిచేశారు. 2004–2009 వరకు ఎస్పీగా పదోన్నతి పొంది ఇంటిలిజెన్స్ విభాగంలో విధులు నిర్వర్తించారు. 2009 నుంచి 2010 వరకు యునైటెడ్ నేషన్స్ పీస్ మిషన్‌లో సుడాన్ దేశంలో పనిచేశారు. 2010–2012 వరకు హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వర్తించారు. అనంతరం టీటీడీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అనంతరం కడప ఎస్పీ, విజయవాడ డీసీపీ, అనంతపురం ఎస్పీ, సీఐడీ ఎస్పీగా పనిచేశారు. 2019 నుంచి 2023 వరకు విజయవాడ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏసీబీ అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2023 ఏప్రిల్ నుంచి ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తున్నారు. 2008లో కఠిన సేవాపతకం, 2010లో యునైటెడ్ నేషన్స్ పీస్ కీపింగ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. 2018లో ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్‌ను కైవసం చేసుకున్నారు.

నేటి నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'



భీమవరంలో అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి విజయలక్ష్మి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ఆరు నెలల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రతి మండలంలో వారానికి ఒక క్యాంపు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాలు, పట్టణాల్లో బుధ, గురువారాల్లో క్యాంపులు ఉంటాయన్నారు. నలుగురు వైద్యుల బృందం ఉంటుందని, గ్రామాల్లో 92 రకాలు, పట్టణాల్లో 187 రకాల మందులను పంపిణీ చేస్తామన్నారు. క్యాంపుల్లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

రాష్ట్ర అధికారి సమీక్ష : ఆరోగ్య సురక్ష ఫేజ్–2 జిల్లాలో నిర్వహణపై జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి జి.విజయలక్ష్మి సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమీక్షించారు. మొత్తం 502 క్యాంపులు నిర్వహిస్తామన్నారు. పటిష్ట ఏర్పాట్లు చేసేలా నోడల్ అధికారులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌ఓ బి.భానునాయక్, జిల్లా నోడల్ అధికారి వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 13 చోట్ల.. మంగళవారం జిల్లాలో 13 సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారు. కలిగొట్ల, పెనుగొండ–5, పెనుగొండ–3, ఆగర్రు, పాలకోడేరు–2, చిట్టవరం, రామన్నపాలెం–1, బొండాడ, ఇరగవరం–2, తాడేరు, అత్తిలి, సిద్దాపురం, ఆచంట–1 సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగనుంది.

సీఎం జగన్ స్ఫూర్తితో ప్రజాదీవెన యాత్ర

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రజా దీవెన పేరిట పాదయాత్ర చేయనున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి అత్తిలిలోని సంతాన వేణుగోపాలకృష్ణ ఆలయ ప్రాంతం నుంచి ప్రజాదీవెన పాదయాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో ప్రతి గ్రామంలోనూ ప్రజల్ని కలుస్తానని, తర్వాత మున్సిపాలిటీ పరిధిలో యాత్ర కొనసాగుతుందన్నారు. రోజూ పాదయాత్ర ముగింపు ప్రాంతంలోనే రాత్రి బస చేస్తానని, మరుసటి ఉదయం అక్కడి నుంచే యాత్ర మొదలుపెడతానన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, పార్టీ శ్రేణులు, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి ఇంటికీ పారదర్శకంగా అందుతున్న పథకాలను, అభివృద్ధిని వివరిస్తానన్నారు.

రూ.6 కోట్లు మంజూరు

తాజాగా ఎన్ఆర్‌జీఎస్ కింద రూ.6 కోట్లు నిధులు తణుకు నియోజకవర్గానికి మంజూరయ్యాయని, వీటితో రోడ్లు, డ్రెయిన్ పనులను వచ్చే నెలాఖరులోపు పూర్తిచేస్తామని మంత్రి కారుమూరి తెలిపారు. 2009లో తన హయాంలోనే రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేశానని, టీడీపీ హయాంలో దోచుకో దాచుకో అనేలా వ్యవహరించారే తప్ప ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. మరలా ఇప్పుడు తాను అభివృద్ధి చేస్తున్నానన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో రూ.3 వేల కోట్లకుపైగా నిధులతో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందించామన్నారు. జగనన్న సంక్షేమంతో రాష్ట్ర వృద్ధిరేటు 11.43 శాతానికి చేరిందని, చంద్రబాబు హయాంలో కేవలం 5.36 శాతం ఉండేదన్నారు. పారిశ్రామికంగా చూస్తే గతంలో 3.17 శాతం ఉన్న వృద్ధిరేటు ఈ ప్రభుత్వ హయాంలో 12.78కి చేరిందన్నారు. వ్యవసాయ రంగంలో చంద్రబాబు హయాంలో 3.54 శాతం ఉండే వృద్ధిరేటు ఇప్పుడు 11.27 శాతానికి పెరిగిందన్నారు. ఇలా రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం అవుతున్న పరిస్థితుల్లో మరలా ముఖ్యమంత్రిగా జగన్‌కు ప్రజలంతా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రాము పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

భీమవరం (ప్రకాశంచౌక్): కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా మంగళవారం భీమవరం రానున్నట్టు జిల్లా సమాచార శాఖ ప్రకటనలో తెలిపింది. స్థానిక ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ భవనంలో సాయంత్రం 5.30 గంటలకు ఆక్వా రైతులు, ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఆపరేటర్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి ఇక్కడే బస చేస్తారన్నారు.

సీఎం జగన్ పాలనలోనే ప్రజలకు రక్షణ

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: బాగా పండిన పంటను నాశనం చేయాలని చూస్తున్న చీడపీడల నుంచి రాష్ట్ర ప్రజలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రక్షిస్తున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెట్టుడు మీసాలు పెట్టుకున్న వారు ఒకరైతే... పై నుంచి దిగిన ధ్రువ స్టార్ మరొకరని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన నవరత్నాలు హామీలు అమలు సాధ్యం కాదని చెప్పిన ప్రతిపక్షాలకు సీఎం జగన్ సమర్థంగా అమలు చేసి చూపించారన్నారు. అయినా ప్రతిపక్షాలు జగన్‌ను చూసి బుద్ధి తెచ్చుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఆంధ్రాలో ఇల్లు నిర్మించుకోలేని వ్యక్తులు, ఎల్లో మీడియా కోరలు విరగ్గొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ పాలనను దేశం మొత్తం చూస్తోందన్నారు. కాపు ఓట్ల కోసం చంద్రబాబు చూస్తుంటే, కాపులను చూపించి చంద్రబాబు నుంచి ఎంత కొల్లగొట్టాలా? అని పవన్ చూస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ ఎన్నికల్లో వీరి నాటకాలు బయటపడ్డాయన్నారు. లోకేష్ కూడా పవన్‌ను లోకువ చేసి మాట్లాడుతున్నాడని, పవన్‌ను నమ్మిన నాయకులు ఎంత బాధపడుతున్నారో అమ్ముడుపోయిన నాయకులు ఆలోచించాలన్నారు. బ్యానర్లు కోసేసే బ్యాచ్ ఏదంటే జేబులు కొట్టే బ్యాచ్ అని, జేబులు కొట్టే సంస్కృతిని వీడాలని హితవు పలికారు. జనసైన శ్రేణులు తన తమ్ముళ్లని, టీడీపీ వారు ముదిరిపోయిన మొక్కజొన్న గింజలని ఎద్దేవా చేశారు. జనసేన శ్రేణులు తప్పుడు మార్గాల్లో వెళ్లవద్దన్నారు. మూడు నెలల్లో రోడ్లన్నీ పక్కాగా వేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ కొట్టు అని, మంచి నడవడికతో గూడెంను అభివృద్ధి చేసుకుందామన్నారు. 2024 ఎన్నికల్లో మరిన్ని సీట్లు వైఎస్సార్‌సీపీకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, సచివాలయాల కన్వీనర్ కొలుకులూరి ధర్మరాజు, బొద్దు సాయిబాబా, కొట్టు విశాల్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

పెనుమంట్ర: మండలంలోని ఎస్.ఇల్లిందులపర్రు గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సెల్ నాయకుడు గుబ్బల నాగేశ్వరరావు తన అనుచరులతో కలిసి సోమవారం పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీ రంగనాథరాజు వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వనమసూరి నారాయణ, ఉప సర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరు వెంకటేశ్వరరెడ్డి, గూడూరు పెద్దిరాజు, మాన్యం మాణిక్యాలు, సిలి కృపావరం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ ప్రశాంతి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): అధికారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. చినఅమిరంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అధికారులు కష్టపడి పనిచేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం 2024 రెవెన్యూ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ యు.రవిప్రకాష్, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి దంపతులు, డీఆర్వో ఎం.శివన్నారాయణరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి వైకేవీ అప్పారావు, ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్ తదితర అధికారులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

భీమవరం(ప్రకాశం చౌక్): నూతన సంవత్సరంలో జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంతోపాటు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. న్యూఇయర్ సందర్భంగా 2024కు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక ప్రకారం తీసుకున్న నిర్ణయాలను సోమవారం ఆమె తెలియజేశారు. మహిళాశిశు సంరక్షణ, వారి ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు, నాడు–నేడు అభివృద్ధి పనుల్లో ఎస్‌జీఓలను భాగస్వామ్యం చేయడం, గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించడం ముఖ్యంగా పండగ నెలలో ఎక్కువ గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగు, సాగునీరు పుష్కలంగా అందించడం, ఆక్వా ఉత్పత్తుల మార్కెటింగ్, అవుట్‌లెట్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి మహిళలు వ్యాపారాల్లో రాణించేలా చేస్తామన్నారు. విద్యకు మరింత ప్రాధాన్యమిచ్చి పాఠశాల నుంచి కళాశాల వరకు విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలను పారదర్శకంగా అందిస్తామన్నారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయడంతో పాటు మరిన్ని నిధు లు సమకూరుస్తామన్నారు. ఇలా జిల్లాలో సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

క్లుప్తంగా

కల్వర్టును ఢీకొని కూలీ మృతి



మృతదేహాన్ని బోదె నుంచి వెలికితీస్తున్న దృశ్యం

పెంటపాడు: నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొని బైక్‌పై ఇంటికి వెళుతున్న ఓ కూలీ కల్వర్టును ఢీకొని పంట బోదెలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై హరికృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమడోలు మండలం వడ్లపట్ల గ్రామానికి చెందిన భీమవరపు రామకృష్ణ (33) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో స్నేహితులను కలిసేందుకు స్వగ్రామం నుంచి కె.పెంటపాడుకు మోటార్ సైకిల్‌పై వచ్చాడు. వేడుకల అనంతరం అర్ధరాత్రి ఇంటికి తిరిగి వెళుతూ పెంటపాడు మూలతూము వద్ద అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణ తలకు తీవ్రగాయమై పక్కనే ఉన్న పంట బోదెలో పడి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పెంటపాడు ఎస్సై హరికృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని వెలికితీసి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి



వివిధ రకాల పండ్లతో క్షీరారామలింగేశ్వరస్వామికి అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం కొత్త సంవత్సరం పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రేషన్ డీలర్లు



తాడేపల్లిగూడెం అర్బన్: డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

సంబరం.. కొత్త సంవత్సరం

ఉమ్మడి జిల్లాలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిల కార్యాలయాలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకుల రాకపోకలతో కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా భారీ కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



భీమవరం : భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



పెనుగొండ: తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజు మహిళలకు ఆర్థిక సహాయం అందించి, చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



నరసాపురం : నరసాపురంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు



కాళ్ల : పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కోమటిలంకలో యథేచ్ఛగా కోడిపందేలు

కైకలూరు/ఏలూరు రూరల్: కొల్లేరు నడిబొడ్డున ఉన్న ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామంలో కోడిపందేలు, జూదం జోరుగా సాగుతున్నాయి. ఆటపాక పక్షుల దొడ్డి గట్టుపై వందలాది వాహనాలు ఉండటమే దీనికి నిదర్శనం. సాధారణ రోజుల్లో పదుల సంఖ్యలో ఇక్కడ వాహనాలను ఉంటుండగా, ఆది, సోమవారాల్లో పెద్ద ఎత్తున పందెం రాయుళ్లు రావడంతో ఈ సంఖ్యలో వందలకు చేరింది. గతంలోనూ కోమిటిలంకలో భారీ ఎత్తున పేకాట, కోడిపందేలు జరిగాయి. అయితే ప్రస్తుతం పెద్ద పండగ రాకముందే గ్రామంలో పందేల నిర్వహణతో రూ.లక్షల్లో సొమ్ము చేతులు మారుతున్నాయి. ఈ గ్రామానికి చేరుకోవాలంటే కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం చెరువు గట్టు మీదుగా వెళ్లడమే ఏకైక మార్గం. దీంతో ఈ రహదారి మీదుగా పోలీసులు వస్తున్న సమాచారం జూదం నిర్వాహకులు ముందే తెలుసుకుని అప్రమత్తమవుతుండటం గమనార్హం. ఇదే అదనుగా రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో సైతం జూదం యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డిని వివరణ కోరగా కోమటిలంకలో జూదం ఆడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఇదిలా ఉండగా, కోమటిలంక గ్రామానికి పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలతో వలస పక్షులు బెదిరిపోతున్నాయి. ఇప్పటికే పక్షుల కేంద్రంలో పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు సంతానోత్పత్తి చేశాయి. ఈ నేపథ్యంలో పక్షుల ఉనికికి ఇబ్బందులే లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.



కోమటిలంక వైపు కొల్లేరు పక్షుల కేంద్రం గట్టుపై భారీ సంఖ్యలో ఉన్న బైక్‌లు

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొయ్యలగూడెం: భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. డిప్పకాయలపాడుకు చెందిన యడ్లపల్లి సురేష్ (30)కు నాలుగేళ్ల క్రితం ఓ యువతితో వివాహమైంది. అప్పటి నుంచి పిల్లలు కలుగలేదు. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేష్ సరిపల్లిలోని చెరువు వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించి అతనిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని సోదరి కలపాల మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ నుంచి జిల్లాకు 74 సర్వీసులు
- జనవరి 10 నుంచి 13 వరకు అందుబాటులో..
- 16 నుంచి 19 వరకు 60 రిటర్న్ సర్వీసులు
- టికెట్‌పై అదనపు చార్జీ లేకుండానే ప్రయాణం



భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. జనవరి 10 నుంచి 13 వరకు నాలుగు రోజుల పాటు హైదారాబాద్ నుంచి జిల్లాకు 74 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తోంది. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అందుబాటులోకి తెస్తోంది. పండుగకు ముందు 74 బస్సులు, పండుగ తర్వాత 16 నుంచి 19 వరకు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 60 ప్రత్యేక బస్సులు తిప్పనుంది. జనవరి తొమ్మిదో తేదీనే ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి జిల్లాల్లో నాలుగు డిపోలైన భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తాయి. పండుగ అనంతరం ఈ నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు నడుపనున్నారు.

హైదరాబాద్‌లో మూడు ప్రాంతాల నుంచి సర్వీసులు

హైదరాబాద్‌లో ఎంజీబీఎస్, ఎస్ఆర్ నగర్, బీహెచ్ఈఎల్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులపై చార్జీల అదనపు భారం వేయకుండా సాధారణ ధరలకే పండుగ స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ప్రత్యేక బస్సుల సర్వీసులకు సంబంధించి ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఆయా ప్రాంతాల్లోని బస్‌స్టేషన్ల వద్ద రిజర్వేషన్ కౌంటర్లకు నేరుగా వెళ్లి కూడా రిజర్వేషన్ చేయించుకోవచ్చు.

బస్సుల వివరాలు

ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ నుంచి భీమవరానికి మొత్తం 3 బస్సులు ఉండగా, వీటిలో సూపర్ లగ్జరీ 1, ఆల్ట్రా డీలక్స్ 2 బస్సులు, నర్సాపురానికి సూపర్ లగ్జరీ 1, తాడేపల్లిగూడెంకు సూపర్‌లగ్జరీ 1, ఆల్ట్రా డీలక్స్ 2 బస్సులు, తణుకు లగ్జరీ 1 ఉన్నాయి. అలాగే 11న హైదరాబాద్ నుంచి భీమవరానికి సూపర్ లగ్జరీ 3, ఆల్ట్రా డీలక్స్ 6 బస్సులు, నర్సాపురానికి సూపర్ లగ్జరీ 3, ఎక్స్‌ప్రెస్‌లు 2, తాడేపల్లిగూడెంకు సూపర్‌లగ్జరీ 2, తణుకు లగ్జరీ 2, ఆల్ట్రాడీలక్స్‌లు 4, 12వ తేదీన హైదరాబాద్ నుంచి భీమవరానికి సూపర్ లగ్జరీ 3, ఆల్ట్రా డీలక్స్ 6 బస్సులు, నర్సాపురానికి సూపర్ లగ్జరీ 3, ఎక్స్‌ప్రెస్‌లు 2, తాడేపల్లిగూడెంకు సూపర్‌లగ్జరీ 2, తణుకు లగ్జరీ 2, ఆల్ట్రాడీలక్స్‌లు 4 బస్సులు నడుపుతున్నారు.

ధరలు ఇలా..

హైదరాబాద్ బీహెచ్ఈఎల్, ఎంజీబీఎస్ నుంచి భీమవరానికి టికెట్ ధర రూ.720, నరసాపురానికి రూ.770, తాడేపల్లిగూడేనికి రూ.750, తణుకుకు రూ.780 చొప్పున నిర్ణయించారు. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ నుంచి భీమవరానికి టికెట్ ధర రూ.690, నరసాపురానికి రూ.740, తాడేపల్లిగూడేనికి రూ.720, తణుకుకు రూ.750 చొప్పున నిర్ణయించారు.

మొత్తం 134 ప్రత్యేక బస్సులు



సంక్రాంతి పండుగకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి మొత్తం 134 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. పండుగకు ముందు 74 సర్వీసులు హైదరాబాద్ నుంచి జిల్లాకు నడుపుతాం. ఈ నెల 10 నుంచి 13 వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు, అలాగే పండుగ అనంతరం 16వ తేదీ నుంచి 19 వరకు 60 ప్రత్యేక బస్సు సర్వీసులు జిల్లా నుంచి హైదరాబాద్‌కు అందుబాటులో ఉంటాయి. పండుగకు జిల్లా వచ్చి తిరిగి వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.వీరయ్య చౌదరి, ప్రజా రవాణా అధికారి, పశ్చిమగోదావరి జిల్లా

రాష్ట్ర స్థాయి పోటీలకు కృష్ణతేజ ఎంపిక



భీమడోలులో కృష్ణతేజను అభినందిస్తున్న ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్

భీమడోలు: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో జరిగిన ఇంటర్ యూనివర్శిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థి అయితం మోహనసాయి కృష్ణతేజ ప్రతిభను కనుబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. సౌత్ జోన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు చెన్నైలో హిందూస్తాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణ తేజ ఆడనున్నాడని ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ సోమవారం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కృష్ణతేజను ప్రిన్సిపల్, ఆధ్యాపక సిబ్బంది అభినందించారు. సౌత్ జోన్ పోటీల్లో ప్రతిభను చాటితే జాతీయ స్థాయి పోటీల్లో ఆడే ఆవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మత్స్యకారులకు తెప్పల అందజేత

టి.నరసాపురం: మిచౌంగ్ తుపాను కారణంగా తెప్పలు కొట్టుకుపోయి ఇబ్బందులు పడుతున్న 30 మంది మత్స్యకారులకు సోమవారం తెప్పలను అందజేశారు. బొర్రంపాలెం మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు కుమారుడు వైఎస్సార్ సీపీ యువ నాయకులు పెండాల్య అభిషేక్‌బాబు రూ.50 వేల విలువ చేసే తెప్పలను 30 మంది మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్‌బాబు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చిందని, వారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశ్యంతోనే వారి జీవనోపాధికి ఉపయోపడేవిధంగా తెప్పలు అందజేశామన్నారు. మత్స్యకార సంఘ నాయకులు కర్రె జక్రయ్య, బత్తుల రమేష్, రాజమోని రమేష్ పాల్గొన్నారు.

మహిళ కడుపులో 10 కిలోల కణితి తొలగింపు

తణుకు: తీవ్ర కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళకు సోమవారం అరుదైన శస్త్రచికిత్స చేశారు. గణపవరం మండలం కాశిపాడు కు చెందిన పాలూరి నిర్మలకు తణుకులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి సుమారు పది కిలోల కణితిని తొలగించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సీపీ ఉషారాణి ఈ శస్త్రచికిత్స చేశారు. ఇలాంటి కేసులు అరుదుగా వస్తాయని ఎక్కువగా మహిళల్లో ఈ సమస్య ఉత్పన్నం అవుతుందని దీనిని 'టోర్షన్ ఒవేరియన్ సిస్ట్' అంటారని, అండాశయ తిత్తి పెద్దగా మారినపుడు దాని రక్తసరఫరా అండాశయం చుట్టూ మెలితిప్పినట్లు చేస్తుందని వెల్లడించారు. వైద్యులు నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ చీర్ల నారాయణరావు పర్యవేక్షణలో కణితిని తొలగించారు.

గాలికుంటు వ్యాధితో అప్రమత్తం

- నేటి నుంచి గ్రామాల్లో పాడి పశువులకు టీకాలు
- జిల్లాలో లక్షా 19 వేల పశువులకు డోసులు సిద్ధం



పశువుల్లో వచ్చే గాళ్లు జబ్బు(గాలికుంటు) నివారణకు టీకీ మందు వేస్తున్న పశువైద్యురాలు (ఫైల్).

ఆకివీడు : పశువుల్లో గాళ్ల వ్యాధితో (గాలికుంటు వ్యాధి) విజృంభిస్తుండటంతో పశుపోషకులు ఆందోళనకు గురవుతున్నారు. పశువుల కాళ్ల గిట్టలు చీలిపోవడం వల్ల వైరస్ ఆ ప్రాంతంలో సోకుతుంది. ఇది అంటు వ్యాధి. వైరస్ వల్ల సోకుతుంది. సాధారణంగా ఈ వ్యాధి జనవరి నుంచి ఏప్రిల్ నెలల్లో పశువులకు సోకుతుంది. సంకర జాతి పశువుల్లో అధికంగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి మందలోని పశువులకు పేడ, నీరుడు పొంగు, వీర్యం, పాలు పుండ్ల ద్వారా గాలి, నీరు, మేత ద్వారా వ్యాప్తి చెందుతుంది.

నివారణే శరణ్యం

పశువులకు సోకిన గాలి కుంటు వ్యాధిని సకాలంలో గుర్తించి నివారించుకోవడం మినహా పూర్తిగా నిర్మూలించేందుకు మందులు లేవు. వ్యాధి సోకిన పశువుకు 14 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి వద్ద బొబ్బలు, కాలి గిట్టల వద్ద బొబ్బలు ఏర్పడతాయి. నడవడానికి, మేత మేయడానికి ఇబ్బంది ఏర్పడుతుంది. సొంగ కార్చుతాయి. పాల దిగుబడి తగ్గిపోతుంది. పొదుగు వాపు ఏర్పడి, పొదుగు వద్ద బొబ్బలు ఏర్పడతాయి. ఆడ పశువులు గర్భధారణ శక్తి కోల్పోతాయి. చూడి పశువులు ఈసుకుపోతాయి. వైరస్ నుంచి పశువును రక్షించేందుకు బోరో గ్లిజరిన్ పేస్టును నోటిలో డెక్కల మధ్య పుండ్లకు పూతగా రాయాలి. యాంటి బయోటిక్స్ మందులు ఇస్తూ నొప్పి తగ్గించేందుకు మందులు వాడాల్సి ఉంది. తేలికగా జీర్ణమయ్యే ఆహారం పశువులకు ఇవ్వాలి.

వైరస్ ప్రబలకుండా...

వ్యాధి సోకిన పశువుల నుంచి వైరస్ ప్రబలకుండా పశువుల మంద నుంచి దూరం చేయాలి. పశువుల శాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. ఆరోగ్యకరమైన పశువులకు వ్యాధి నివారణా టీకాలు వేయించాలి. రైతులు గాలి కుంటు వ్యాధి నివారణకు జనవరి 2వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలుగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. తమ పశువుకు రోగం రాలేదు కదా అని నిర్లక్ష్యం వహిస్తే వ్యాధి సోకిన తరువాత పశువుకు, యజమానికి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని పశు సంవర్ధక శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

లక్షా 19 వేల పశువులకు టీకాలు

జిల్లాలో లక్షా 19 వేల పశువులకు గాలి కుంటు నివారణా టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి మురళీకృష్ణ చెప్పారు. నెల రోజుల పాటు అన్ని గ్రామాల్లోని నాలుగు నెలలు నిండిన దూడలు, ఆవులు, గేదెలకు గాలి కుంటు వ్యాధి నివారణా టీకాలు వేయనున్నారని చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

15 మంది అరెస్ట్, రూ.10,900 నగదు స్వాధీనం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట, కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. వీటిలో 15 మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.10,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. దొరసానిపాడులో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,100 స్వాధీనం చేసుకున్నారు. అలాగే సోమవారం ఉదయం సీహెచ్ పోతేపల్లిలో కోడిపందేల స్థావరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7,200 నగదు, 2 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం తిరుమలంపాలెంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,600 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె విరమించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): బాలింతలు, గర్భిణులు, పసిపిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె విరమించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2019 నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు చేసిన మేలు వివరిస్తూ.. వీరి పలు డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందని పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీలోపు విధులకు హాజరుకావాలని కోరారు. సమ్మె విరమించకపోతే ప్రభుత్వ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆహ్లాదాన్ని పెంచేలా పార్కుల అభివృద్ధి



తణుకు టౌన్ : జవాన్ పార్కులో విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు అర్బన్ : తణుకులో ఐ లవ్ తణుకు చిహ్నం వద్ద నిల్చున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం సాయంత్రం తణుకు వెంకట్రాయపురం ఆంధ్రా సుగర్స్ ఎదుట రూ.43 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన జావాన్ పార్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ తణుకు మహిళా కళాశాల వద్ద రూ.40 లక్షలతో ఐ లవ్ తణుకు స్వాగత పార్కును అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అదే విధంగా తణుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో పిల్లలను గ్రామీణ ప్రాంత వాసులను ఆకర్షించేలా పార్కులను ఆహ్లాదకరంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని రోడ్లను రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వాటిలో రూ.5 కోట్ల విలువైన రోడ్ల పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా రూ.5 కోట్ల విలువైన రోడ్ల పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. తణుకు నరేంద్ర సెంటర్‌లో ఉన్న వాటర్స్ ఫాల్స్‌ను మరింత సుందరీకరిస్తామని చెప్పారు. తణుకు పట్టణంలో వ్యాపార, వాణిజ్య అభివృద్ధిని సూచించేలా ఇక్కడ సుందరమైన నీటి పార్కును ఏర్పాటు చేస్తామని తెలిపారు. పట్టణంలోని అన్ని పార్కుల్లో అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షుడు సుందరరామరాజు, మున్సిపల్ డీఈ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణకు కృషి

తణుకు అర్బన్: వ్యాపార, వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు ప్రాంతాన్ని మోడల్ తణుకుగా సుందరీకరణ చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. తణుకు జాతీయ రహదారి సమీపంలోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఐ లవ్ తణుకు వర్ణనాత్మక నిర్మాణాన్ని సోమవారం మంత్రి కారుమూరి ప్రారంభించి మాట్లాడారు. తణుకులోకి ప్రవేశించే మూడు వైపులా గతంలో సుందరంగా ఉండే 3 ఆర్చ్‌లు నిర్మాణం చేశామని, తణుకువాసులంతా హర్షం వ్యక్తం చేశారని, అదే స్ఫూర్తితో ఐ లవ్ తణుకు పేరుతో వర్ణనాత్మక నిర్మాణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఇప్పటికే తణుకు ప్రజానీకం నిర్మాణం వద్ద ఆహ్లాదంగా సేదతీరుతున్నారని, సెల్ఫీలు తీసుకుంటూ తణుకును ఒక మోడల్‌గా సోషల్ మీడియాలో చూపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, యువనేత కారుమూరి సునీల్ కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లి సూరిబాబు, నూకల కనక దుర్గ, కుడుపూడి చంద్రరావు, పైబోయిన ఏసుబాబు, సామంతుల అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుంతలో ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం



పుంతలో ముసలమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాం పేట కొబ్బరితోటలో యువ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన పుంతలో ముసలమ్మ అమ్మ వారి ఆలయ 41వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి మేలుకొలుపు, మంగళస్నానం, సుప్రభాత సేవ, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజా త్రినాథ్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం



ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న మాజీ ఎస్టీఓ హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్స్ ఆన్‌లైన్ ప్రక్రియ సోమవారం సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ భవనంలో ప్రారంభించారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి.జయదత్తేశ్వరరావుకు పెన్షనర్స్ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎస్టీఓ బి.హరికుమార్ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. జయదత్తేశ్వరరావు మాట్లాడుతూ జనవరి నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా పెన్షనర్స్ తప్పని సరిగా ప్రమాణ పత్రాలు అందజేయాలన్నారు. అసోసియేట్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ, కోశాధికారి ఎండీ ముస్తాఫా, దాసం నాగేశ్వరరావు, వీకే వీరారావు, ఎం.అర్జునరావు, కె.సూరెడ్డి, విశ్వంరాజు, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, పెన్షనర్స్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష పూజలు



పూజలు చేసిన భక్తులు

అత్తిలి: నూతన సంవత్సరం సందర్భంగా అత్తిలి శ్రీ అయ్యప్ప స్వామి ఆలయాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి ఆభరణాలను అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి ఇంటి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆలయ అర్చకుడు ఐలూరి రాజశేఖర శర్మ స్వామివారికి పూజాధికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బల్లిపాడులో..

బల్లిపాడు గ్రామంలో గల అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తిని ఉంచి, కేరళ డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో అయ్యప్ప, భవాని భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా సోమవారం ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. వాసవి అమ్మవారు ఆలయం, పాతూరు నరసింహ స్వామి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీ దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయం, ఆర్టీసీ డిపో వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయం, పెద్ద శివాలయం తదితర ఆలయాలను భక్తులు దర్శించారు.

చిన వెంకన్నను దర్శించిన తాతా శ్రీనివాసరావు



ద్వారకాతిరుమలలో స్వామివారిని దర్శించిన తిరుమల ట్రస్ట్ బోర్డు సభ్యుడు తాతా శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తాడేపల్లిగూడెంకు చెందిన తిరుమల ట్రస్ట్ బోర్డు సభ్యుడు తాతా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికింది. ఆయన వెంట బండారు బెనర్జీ, తాత జగదీష్, మాదిరెడ్డి నాని, తోట మూర్తి, చిటకన సూర్య ప్రకాష్ సత్య గోపికృష్ణ తదిరతులు ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన వీసీ జానకిరామ్



డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిసిన వీసీ జానకిరామ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను తాడేపల్లిగూడెంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయం క్యాలెండర్ మంత్రి సత్యనారాయణకు బహుకరించారు.

బాలోత్సవంలో విజేతలకు బహుమతులు

భీమవరం: భీమవరంలో నిర్వహించిన బాలోత్సవంలో విద్యా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకుడు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. బాలోత్సవంలో భీమవరం పట్టణంతో పాటు భీమవరం, వీరవాసరం, ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు చెందిన 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వీరిలో విజేతలైన 220 మందికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. బాలోత్సవం నిర్వహణకు 100 వలంటీర్లు, వివిధ స్వచ్ఛం సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని ప్రసాదరాజు వివరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి యువత కృషి చేయాలి



తణుకులో వైఎస్సార్ సీపీ జిల్లా పదవులు పొందిన యువతతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు యువత నడుం బిగించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో తణుకు నియోజకవర్గంలోని యువతకు పదవులు కేటాయించిన నేపథ్యంలో తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలు, అవాస్తవాలను తిప్పి కొట్టేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అత్తిలికి చెందిన రామిశెట్టి రాము, జిల్లా కార్యదర్శులుగా తూర్పు విప్పర్రుకు చెందిన మామిడిశెట్టి శ్రీనివాస్, దువ్వకు చెందిన చెట్టి సునీల్, సహాయ కార్యదర్శులుగా తణుకుకు చెందిన కారుమంచి యోహాన్, రేలంగికి చెందిన రాట్నాల వీరాస్వామి (రమణ) ఎన్నికైనట్లు మంత్రి కారుమూరి వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువనేత కారుమూరి సునీల్ కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు నాగబాబుకు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగబాబు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన పెద్దోజు నాగేశ్వరరావు (నాగబాబు) ఇటీవల గుంటూరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన నంది నాటక పోటీల్లో అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబరు 23 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులో జరిగిన నంది నాటక పోటీల్లో విజయవాడ రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన విజ్ఞాన భారతం అనే సాంఘిక నాటకంలో నాగబాబు నటించిన రామశాస్త్రి పాత్రకు ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందజేసినట్లు తెలిపారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో జరిగిన నంది అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ సినీ నటుడు, రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నటుడు పోసాని కృష్ణ మురళి చేతుల మీదుగా నంది అవార్డు అందుకున్నట్లు చెప్పారు. నాగబాబు గతంలో కూడా నంది అవార్డుతో పాటు గరుడ, సింహాద్రి, నటరాజ్, వీణా అవార్డులను కూడా పొందినట్లు తెలిపారు.

వైఎస్సార్ బీమా పత్రాల అందజేత



పత్రాలు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేరుపాలెం ఘటనలో మృతిచెందిన మహిళ కుటుంబానికి రూ.5 లక్షలు వైఎస్సార్ బీమాతో జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది అక్టోబరు నెలలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లి గల్లంతై మృతిచెందిన గౌరస నాగ శ్రీలక్ష్మి సావిత్రి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పేరిట ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షలను బాధిత కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాకు జమచేసి సంబంధిత పత్రాలను సోమవారం మంత్రి కారుమూరి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు జిలానీ, వార్డు సెక్రటరీ హరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆయన ఇంటి వద్ద అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం పట్టణంతో పాటు రూరల్, పెంటపాడు మండలాల నుంచి భారీగా తరలి వచ్చి మంత్రి కొట్టుకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని అభిలషించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

మంత్రికి రుణపడి ఉంటా..

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగానికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు రుణపడి ఉంటానని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పట్టణం నారాయణ కళాశాల సమీపంలోని తన నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైకాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సొసైటీ చైర్మన్లు గుమ్మళ్ల తాతారావు, వెలిశెట్టి నరేంద్ర కుమార్, డైరెక్టర్ నీలపాల రామన్న, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, రావిపాడు సొసైటీ మాజీ చైర్మన్ ములగాల బాబ్జీ, ఏఎంసీ కార్యదర్శి ఎంఎస్‌వీ ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యాన..

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడు దూలం నాగరాజు కేక్ కట్ చేశారు. వాకర్స్ సభ్యులు చలం, పరమాత్మ, కుమారస్వామి, మాకా శ్రీనివాసరావు, నరసింహమూర్తి, అనిల్, బాకా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యాన పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌లో రైస్ బ్యాగ్, నిత్యావసర వస్తువులు అందజేశారు. పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కొప్పిశెట్టి రమణయ్య పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు కాసుల పేరు బహూకరణ



బంగారు కాసుల పేరును బహుకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం శ్రీ ముత్యాలమ్మను పట్టణానికి చెందిన అడపా సూరిబాబు, సత్య, అడపా సోహన్ బాబు, మారిశెట్టి పద్మ కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి 48.640 గ్రాములతో తయారు చేయించిన రూ.2 లక్షల 62 వేల 656లు విలువైన బంగారు కాసుల పేరును బహుకరించారు. తొలుత పూజలు చేసి, అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రూ.3వేలు పింఛన్ పంపిణీ

నరసాపురం: వైఎస్సార్ పింఛన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం 9 గంటలకు కాటన్‌పార్కు వద్ద నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఈనెల నుంచి ప్రభుత్వం లబ్ధిదారులకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి ఇస్తుందని చెప్పారు. పట్టణంలోని 31 వార్డులకు సంబంధించి పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కాటన్‌పార్కులో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభిస్తారని చెప్పారు.

జేసీఐ రైజింగ్ సంస్థకు అవార్డుల పంట

పాలకొల్లు సెంట్రల్: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జేసీఐ పాలకొల్లు రైజింగ్‌కు అవార్డులు వచ్చినట్లు జేసీఐ అధ్యక్షురాలు డాక్టర్ కావలి మౌని సోమవారం తెలిపారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో పట్టణ జేసీఐకి అవుట్ స్టాండింగ్ నేషనల్ అవార్డు, నేషనల్ ప్రెసిడెంట్ అవార్డు, అప్రిసియేషన్ అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా జేసీఐ ఫస్ట్ లేడీ జోన్ చైర్మన్‌గా మీనా మణిదీప్తి, జోన్ డైరెక్టర్‌గా డాక్టర్ కావలి మౌని, జోన్ కోఆర్డినేటర్‌గా కారుమూరి ప్రదీప్ ఎంపికయ్యారు. 2024 జేసీఐ రైజింగ్ ప్రెసిడెంట్‌గా మామిడి కౌశిక్ ఎంపికయ్యారు.

న్యూ ఇయర్‌లో ప్రజలంతా బాగుండాలి

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు అర్బన్ : తణుకులో మంత్రి కారుమూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు



తణుకు టౌన్ : పైడిపర్రులో కేక్ కట్ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ

తణుకు అర్బన్: నూతన సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సోమవారం తణుకు సజ్జాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలతోపాటు పల్నాడు జిల్లా, పశ్చిమ, ఏలూరు జిల్లాల నుంచి ప్రజలు, అధికారులు, పార్టీ నాయకులు మంత్రి కారుమూరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లపాటు అవినీతి రహితంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించారని అన్నారు. ఇచ్చినమాట ప్రకారం 99 శాతం మ్యానిఫెస్టోని అమలు చేసిన నేతగా సీఎం జగన్ చరిత్రకెక్కారని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజానీకానికి మరింత మంచి చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భగవంతుడు మరింత ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ సి.శరత్ రాజ్ కుమార్ మంత్రి కారుమూరికి గజమాల వేసి సత్కరించి కేక్ కట్ చేయించారు. సీఐలు కె.నాగరాజు, సీహెచ్ ఆంజనేయులు, ఎస్సైలు శుభాకాంక్షలు తెలిపారు.

తరలి వచ్చిన జనం

నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాల నుంచి సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కారుమూరి అభిమానులు తణుకులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి తరలివచ్చారు. మున్సిపల్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్, వ్యవసాయ శాఖ, పోలీసు, ఫైర్, వైద్యశాఖ, ఐఎంఏ వైద్యులతో పాటు జట్టు కూలీలు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి కేక్ కట్ చేశారు. పార్టీ కార్యాలయం వద్ద వచ్చిన వారందరికీ అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, యువనేత కారుమూరి సునీల్ కుమార్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణి ప్రసాద్, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మహిళాధ్యక్షులు నూకల కనకదుర్గ, కాకర్ల విశాలాక్షి, మెట్ల కిరణ్మయి, మారిశెట్టి శివశంకర్ ఉండవల్లి జానకి, సూరంపూడి కామేష్, పాట్ల సురేష్, నత్తా భానుప్రసాద్, వీరమల్లు ఫణీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైడిపర్రులో..

తణుకు టౌన్: న్యూ ఇయర్ వేడుకలను తణుకు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పైడిపర్రులోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ మాజీ కో ఆర్డినేటర్ చీర్ల రాధయ్యతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. తణుకు మండలంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తణుకు పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, వేల్పూరులోని సెయింట్ పాల్స్ తదితర చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం రాత్రి నుంచి ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.